రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

జిల్లావ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతుభరోసా జమ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త:
మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 4,291మంది రైతుల ఖాతాల్లో 2కోట్ల 57లక్షల రూపాయలు రైతు భరోసా జమ జరిగినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందే రైతుల ఖాతాల్లో సంతోషం చూడటానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా రూపాయలు జమ జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌కు ముందే రైతులశ్రేయస్సు కోసం రైతు భరోసాను విడతలవారీగా ఖాతాల్లో జమ చేస్తుం దన్నారు. రైతుభరోసా పథకం వ్యవసాయానికి పెట్టుబడిభారం తగ్గించి ఉత్పాదకతను పెంపొం దించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వానాకాలంసాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతుభరోసా నిధులు అందించటం పట్ల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు, జూన్ 18, ప్రభాతవార్త:
తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను నాలుగవ తరగతిలో ప్రవేశాల కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాధికారి కె.అంగూర్‌నాయక్ తెలిపారు. 01-09-2016 నుండి 30-08-2017 మధ్య జన్మించిన 8 నుండి 9 ఏళ్ల వయస్సుగల విద్యార్థినీవిద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలల్లో ఈ ప్రవేశాలకు మూడంచెల ఎంపిక విధానం ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా కొత్తూరు ఉన్నత పాఠశాలలో నేడు ఉదయం 10 గంటలకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థినీవిద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 9963081675, 9704941074 నెంబర్లకు సంప్రతించాలని తెలిపారు.

ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలి

-ఎంపి ఈటల రాజేందర్
-ఎంపిని కలిసిన మేడ్చల్ మున్సిపల్ బిజెపి నూతన కమిటీ సభ్యులు



ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసిన మేడ్చల్ మున్సిపల్ నూతన కమిటీ సభ్యులు

మేడ్చల్, జూన్ 18, ప్రభాతవార్త:
నూతనంగా ఎన్నికైన మేడ్చల్ మున్సిపల్ బిజెపి కమిటీ సభ్యులు బుధవారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిశారు. మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపిని కలిసి ఆయనకు కమిటీ సభ్యులను పరిచయం చేశారు. ఈసందర్భంగా ఎంపి వారిని అభినందించి ఎన్నికైన కమిటీ సభ్యులు బాధ్యతతో పనిచేసి పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని ఈసందర్భంగా తెలియజేశారు. పార్టీలోని కొత్త, పాత నాయకులను కలుపుకునిపోయి ప్రజాసమస్యలపై స్పందించాలని సూచించారు. పదవి తీసుకున్న ప్రతి ఒక్కరికీ బాధ్యత పెరుగుతుందని, అందుకనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్రనాయకుడు విక్రంరెడ్డి, జిల్లా నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, కమిటీ ఉపాధ్యక్షులు మైసరి రాజు, సర్వేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు వంజరి వంశీవిజయ్, జాకట ప్రేమ్‌దాస్, కార్యదర్శులు దాత్రిక లక్ష్మణ్, బండి విష్ణుగౌడ్, దొంతరబోయిన సాయి, బొక్క సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు వెంకటేష్‌ముదిరాజ్, రాంచందర్‌రెడ్డి, నవీన్, ఎస్‌వి శ్రీనివాస్, జాకెట్ బాలకృష్ణ, బొక్క సురేందర్‌రెడ్డి, టైలర్ రాజు, శ్రీపాల్‌రెడ్డి, నర్సింగ్, శ్రీమాన్, గౌతం, నాయకులు రాఘవరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్‌లను సందర్శించిన హైడ్రా కమిషనర్

బాధితులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:
ఇరువర్గాల నుండి పూర్తిస్థాయి వివరాలు సేకరించిన తర్వాత న్యాయ నిపుణులతో చర్చించిన మీదట ఏకశిలానగర్ వెంచర్‌పై నిర్ణయం తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. పోచారం మున్సిపల్ కొర్రెముల రెవెన్యూ పరిధిలోగల సర్వేనెంబర్లు 739 నుండి 749లలో ఏర్పాటుచేసిన ఏకశిలానగర్ వెంచర్‌ను హైడ్రా కమిషనర్ బుధవారం సందర్శించి పరిశీలించారు. అంతకుముందు సంస్కృతి టౌన్‌షిప్ అప్రోచ్ రోడ్డును పరిశీలించారు. ఏకశిలానగర్ బాధితుల ఫిర్యాదుమేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కొర్రెములపరిధిలోని ఏకశిలావెంచర్‌లో పర్యటించారు. అనంతరం కమిషనర్ ప్లాట్ల బాధితులతో మాట్లాడారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తమప్లాట్ల కొరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులతో వారంరోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి వివరాలు సేకరిస్తామని అన్నారు. తదుపరి హర్షన్‌ప్రక్షన్స్ యాజమాని వెంకటేశ్‌లతో మాట్లాడి కోర్టు వివరాలు తెలుసుకుని న్యాయ నిపుణుల సంప్రతింపుల అనంతరం తుదినిర్ణయం తీసుకుంటామని అంతవరకు బాధితులు ఓపికవహించాలని అన్నారు. సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు ఇరువర్గాల వద్ద ఏ డ్యాక్యుమెంట్లు ఉన్నా పూర్తి సమాచారంతో రావాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులు ఏమైనా ఉంటే పూర్తి వివరాలు తెలుపాలని అన్నారు. ఇరువర్గాల నుండి పూర్తిస్థాయి సమాచారం సేకరించిన తర్వాతనే హైడ్రా లీగల్‌సెల్ సూచనల మేరకు చర్యలుంటాయని తెలిపారు. అంతకుముందు ఏకశిలానగర్‌వెంచర్ బాధితులతరపున న్యాయవాది జుబేద్ అక్రం, శివారెడ్డి తదితరులు హైడ్రా కమిషనర్‌కు ప్లాట్ల బాధితులకు జరుగుతున్న అన్యాయంపై వివరించారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల రెవెన్యూ అధికారులు, పోచారం మున్సిపల్ అధికారులు, బాధితులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

లబ్దిదారులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేస్తున్న ఎమ్మెల్యే

పరిగి, జూన్ 18, ప్రభాతవార్త:
పరిగిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి పరిగి పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. పేదవారికి సొంత ఇంటి కల నిజంచేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేస్తూ, 5లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి, మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 ఇండ్లను ఇవ్వడం జరుగిందని ఎమ్మెల్యే తెలిపారు. పరిగి అభివృద్ధిలో భాగంగా రెండు కోట్ల రూపాయలతో సిసి రోడ్లు ఏర్పాటు చేశామని, త్వరలో 25కోట్ల రూపాయలతో డ్రైనేజీ, సిసి రోడ్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కమిషనర్ వెంకటయ్య, నాయకులు లాల్ కృష్ణ, హనుమంతుముదిరాజ్, ఎఎంసి వైస్‌చైర్మన్ అయూబ్, నాయకులు అశోక్, అక్బర్, చిన్న నరసింహులు, ఆనం ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, ఏజాజ్, వెంకటేష్, శ్రీధర్, రామకృష్ణరెడ్డి, రామ్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా

తలకొండపల్లి, జూన్ 18, ప్రభాతవార్త:
తలకొండపల్లి మండలపరిదిలోని గట్టిప్పలపల్లి గ్రామములోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని, అధికారులపనితీరును నిరసిస్తూ బుధవారం రైతులు, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గట్టిప్పలపల్లి గ్రామ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు గట్టిప్పలపల్లి, వెంకట్రావుపేట, మెదక్‌పల్లి, జంగారెడ్డిపల్లి, గడ్డతండ, ఆర్లకుంటతండా గ్రామాలకు చిన్నవాన పడినా, బలమైనగాలి వచ్చినా వెంటనే విద్యుత్‌ను తీసివేస్తున్నారని దానివలన గ్రామాల్లో రాత్రిపూట దోమలు, విష జంతువుల బెడద ఎక్కువైందనివారు ఆరోపించారు. అలాగే విద్యుత్‌స్తంభాల వైర్ల మీద చెట్లు అల్లుకుపోవడం వలన సమస్య ఎక్కువైందని త్వరగా చెట్లకొమ్మలను తొలగించాలని, గట్టిప్పలపల్లి గ్రామానికి, వ్యవసాయానికి ఒకటే లైన్ ఉండడంవల్ల ఎక్కడ ఇబ్బందికలిగినా గ్రామానికి, వ్యవసాయానికి విద్యుత్‌సరఫరా నిలిపివేస్తు న్నారని, వేరువేరులైన్‌లు వేయాలనికోరారు. ఒకవేళ అధికారులు దీనిపైస్పందించకపోతే తలకొండపల్లి మండలలోని విద్యుత్ ఆఫీసుముందు పరిసర గ్రామాల ప్రజలతో కలిసి ధర్నాచేస్తామని నాయకులు తెలియజేసారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌పార్టీ తలకొండపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీసర్పంచ్ జయమ్మ వెంకటయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ కోల శిరీష కృష్ణయ్య, బిఆర్‌ఎస్‌పార్టీ గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు, ఉపాధ్యక్షుడు కానుగుల జంగయ్య, బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు శరత్‌చంద్రశర్మ, అశోక్‌గౌడ్, బోల్లి కృష్ణయ్య, ఏదుల శరత్‌చంద్ర, మ్యాక శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వార్డుమెంబర్ దేశమోని రాములు, బిజెపినాయకులు విజయ్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గల్లీల్లో (ఎటిఎం)..ఎనీ టైం మద్యం కొట్లు..

-కిరాణ కొట్లే..మద్యం షాపులు
-పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

అంగన్‌వాడీ స్కూల్లో తాగుబోతులు తాగి వదిలేసిన మద్యం సీసాలు

ధారూరు, జూన్ 18, ప్రభాతవార్త:
పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. ఎటిఎం సెంటర్లు మండల కేంద్రాల్లోనే కనిపిస్తే, పల్లెల్లోని గల్లీల్లోసైతం ఎటిఎంలు దర్శనమిస్తు న్నాయి. అదే.. ఎనీ టైం మద్యం సెంటర్లు. ధారూరు మండలంలోని పలు గ్రామాలలో బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతు న్నాయి. కిరాణ దుకాణాలు, ఇళ్లలో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచుకుని అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. మండలకేంద్రంలోని, హైవేల పక్కన ఉన్న వైన్స్‌లలో భారీమొత్తంలో మద్యాన్ని తెచ్చుకొని నిల్వచేసుకుని అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్నారు. ప్రతి గ్రామంలో కనీసం పది బెల్ట్ షాపులు దర్శనమిస్తాయి. దీంతో గ్రామాల్లో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. కష్టపడి సంపాదించిన డబ్బులు మద్యానికి తగలేస్తున్నారని గ్రామంలోని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణ..
గ్రామాల్లోని ప్రతి కిరాణ కొట్టులో పలు బ్రాండ్లకు చెందిన మద్యం సీసాలు దర్శనమిస్తాయి. కొన్ని చోట్ల తడకలు వేసి చిన్న సైజు కల్లు దుకాణంలా మార్చి బెల్టు దందా సాగిస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. బెల్టు షాపుల్లో క్వార్టర్ మద్యానికి ఎమ్మార్పీ ధర కంటే రూ.20, బీరుకు రూ.40 అదనంగా మద్యంప్రియుల నుంచి వసూలు చేస్తున్నారు. ఎప్పుడుపడితే అప్పుడు మద్యం లభించడంతో మద్యంప్రియులు పొద్దంతా మద్యంమత్తులో తూలుతున్నారు. తమ ఇంటి వారు మద్యానికి బానిసై బతుకుతెరువు ప నులేవీ చేయడం లేదని మహిళలు వాపోతున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిడ్జ్‌లు పెట్టుకొని మరీ మద్యం విక్రయిస్తున్నారని మహిళలు వాపోతున్నారు. వైన్‌షాపుల యజమానులు ఆటోలద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోల ద్వారా పంపించి మద్యం అమ్ముతున్నారు. మద్యంమత్తులో ఇళ్లమధ్యలో గొడవలు పడుతూ తాగుబోతులు అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామంలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు దృష్టిసారించి గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు, ప్రత్యేకంగామహిళలు కోరుతున్నారు.

టెన్త్‌లో ఉత్తీర్ణతసాధించి భవిషత్ లక్ష్యాన్ని ఎంచుకోవాలి

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి
-జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల తనిఖీలు చేసిన వైనం

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త:
పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించి భవిషత్ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, కృషి, పట్టుదల, క్రమశిక్షణ విజయానికి దోహదపడనున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి, బౌరంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ పదవతరగతిలో మంచి మార్కులు సాధించటానికి కష్టపడి చదవాలని, విద్యతోనే మంచి భబిషత్ ఉంటుందని అన్నారు. స్కూల్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా అంటూ విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో స్పోర్ట్సు ఏర్పాటు చేయాలని, గ్రౌండ్‌ను చదును చేయించాలని కలెక్టర్‌ను విద్యార్థులు కోరారు. బాగా చదువుకోవాలని అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. స్కూల్‌కు కావలసిన నివేదిక ద్వారా అందజేయాలని ప్రధానోపాధ్యాయుడిని కలెక్టర్ ఆదేశించారు. గతంలో అదనపు గదుల కోసం నివేధిక పంపామని తెలుపటంతో మళ్లీ నోట్‌పెట్టాలని అవసరం ఉన్న వసతులను కల్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

వైద్యుడి కారులో గంజాయి..

-కావాలనే డాక్టర్‌ను ఇరికించారని ఐఎంఎ సభ్యుల ఆరోపణ
-దర్యాప్తు చేపట్టిన పోలీసులు

సిఐని కలిసి బయటికి వస్తున్న ఐఎంఎ సభ్యులు (ఇన్‌సెట్‌లో గంజాయి ప్యాకెట్లు)

వికారాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:
వైద్యుడు ప్రయాణిస్తున్న కారులో గంజాయి లభ్యమైంది. దీంతో ఒక్కసారిగా వైద్యబృందం ఉలిక్కిపడింది. సదరు వైద్యుడికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు మద్దతుగా నిలిచారు. ఈవిషయమై జిల్లా ఎస్పి, స్థానిక సిఐని ఐఎంఎ సభ్యులు కలిశారు. కావాలనే వైద్యుడి వాహనంలో ఇతరులు గంజాయి ప్యాకెట్లు ఉంచి పోలీసులకు పట్టుపడేలా చేశారంటూ వైద్యులసంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈసంఘటన వికారాబాద్ జిల్లాలో కలకలం రేపింది. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం సమయంలో వికారాబాద్ పట్టణంలోని ప్రధానకూడలిలో స్థానికపోలీసులు వాహనాలతనిఖీ నిర్వహిస్తున్నారు. అటుగా వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చెందిన వైద్యుడు టిఎస్10ఇఎస్8811 నెంబరు గల ఫార్చునర్ కారులో వస్తున్నాడు. సదరు వైద్యుడి వాహనాన్ని పోలీసులు తనిఖీచేయగా 65గ్రాములు ఉన్న గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈవిషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ భీమకుమార్ తెలిపారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఐఎంఎ సభ్యులు..
వైద్యుడి వాహనంలో గంజాయి లభ్యమైన విషయాన్ని తెలుసుకున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు జిల్లా ఎస్పి నారాయణరెడ్డిని బుధవారం కలిశారు. వైద్యుడిపై మోపిననింద సరైనది కాదని, కుట్రపూరిత ధోరణులు ఏవైనా దాగి ఉంటే తగు విచారణ చేసి న్యాయం చేయాలని ఐఎంఎ సభ్యులు జిల్లా ఎస్పిని కోరారు. ఎస్పిని కలిసిన వారిలో డాక్టర్ పురుషోత్తమ్, డాక్టర్ శాంతప్ప, డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, డాక్టర్ సాదుసత్యనాధన్, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకం

-అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కార్యక్రమంలోపాల్గొన్న జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, భూభారతిలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని, శిక్షణాకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాల్‌లో జరుగుతున్న లైసెన్స్ సర్వేయర్ల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్లకు భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు పలు అంశాలపై అనుభవం కల్గిన నిపుణులచేత శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ సర్వేయర్లు భూభారతి చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ శిక్షణాకార్యక్రమాలు 45రోజులపాటు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిక్షణను సర్వేయర్లు శ్రద్ధగా విని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈశిక్షణలో మీ నైపుణ్యాన్ని పెంపొందించుకుని భూభారతి చట్టం అమలులో మీ సేవలను అందించాలన్నారు. భూభారతి చట్టం మీసేవల ద్వారా ప్రజల, రైతుల సమస్యలను తొలగించటంలో ముందుండి అంకితభావంతో పని చేయాలని అన్నారు. మీరుచేసే పనులలో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డిఐఓ బాలరాం, లైసెన్స్ సర్వేయర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో మహిళ అదృశ్యం

ఘట్‌కేసర్, జూన్ 18, ప్రభాతవార్త:
కుటుంబ కలహాలతో ఓమహిళ తన ముగ్గురు పిల్లలను వదిలేసి వెళ్లిపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఏదులాబాద్ రోడ్డు క్రిష్ణమార్క్ వెనుక వీధిలో ఉంటున్న కంచుకం వెంకటేశ్‌భార్య నందిని(24) ఈనెల 15వతేదీ నుంచి కనిపించకుండాపోయింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తన ముగ్గురు పిల్లలను వదిలి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త వెంకటేశ్ ఆమె కోసం అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. భర్తతో గొడవలు జరుగుతున్న కారణంగా నందిని ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తెలుస్తున్నది. ఈమేరకు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదుతో మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. ఆమె వివరాలు తెలిస్తే పిఎస్ నెంబర్ 8712662705కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

రైల్వేవంతెనపై కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం

-ఆర్‌ఓబి బాధితులకు నష్టపరిహారం అందించాలి
-బస్సులు రాక ప్రయాణికుల అవస్థలు
-వంతెన పూర్తిచేయకుంటే మహాధర్నా

ఘట్‌కేసర్, జూన్ 18, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు పూర్తి చేయడంలో అధికారులు, కాంట్రాక్టర్లు తీవ్ర అలసత్వం ప్రదరి శ్శిస్తున్నారని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆరోపించారు. ఘట్‌కేసర్ పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆర్‌ఓబి గత 15సంవత్సరాలుగా కొనసాగుతున్నదని తెలిపారు. రైల్వేవంతెన నిర్మాణం కారణంగా ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం చెల్లించి తగిన న్యాయం చేయడంలో జిల్లా స్థాయి అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. గతంలో ఆర్‌ఓబి పూర్తి చేయాలని నిరాహారదీక్ష చేయగా అప్పటి మంత్రి మల్లారెడ్డి వచ్చి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించామని హామీ ఇచ్చి 18నెలలలో పూర్తిచేస్తామని చెప్పిన కాంట్రాక్టర్ రెండు సంవత్సరాలు గడుస్తున్నా కార్మికులను తక్కువసంఖ్యలో పెట్టి ఆలస్యం చేస్తున్నాడని ఆరోపించారు. టెండర్ ప్రకారం నిర్ణీత గడువులో వంతెన పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టర్‌ను అధికారులు బ్లాక్ లిస్ట్‌లో పెట్టకుండా ఇంకా జాతీయ రహదారి పనులను కూడా అప్పగించడం సమంజసంగా లేదన్నారు. వంతెనకు ఇరువైపులా రోడ్డు వెడల్పు చేయకపోవడంతో ఆర్‌టిసి బస్సులు పట్టణంలోకి రావడం లేదని బైపాస్ రహదారి మీదుగా వెళ్తుండటంతో మహిళలు, వృద్ధులు రెండు కిలోమీటర్ల పాటు రాకపోకలు చేయడానికి తీవ్రంగా తిప్పలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఓబిని పూర్తి చేయించడంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని తనకు పట్టింపు లేదని అధికారపార్టీ నాయకులను అడగాలని చెప్పడం తగదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అన్ని ఆర్‌ఓబిలు పూర్తి చేశారని ఘట్‌కేసర్‌లో మాత్రం 15ఏళ్లుగా పనులు కొనసాగుతుండటం గమనార్హమని అన్నారు. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి బాధితులకు నష్టపరిహారం అందించి వంతెనపనులు వేగవంతంచేసి పూర్తిచేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

కరెంట్ షాక్‌తో పాడిగేదెలు మృతి

కరెంట్ షాక్‌తో మృతిచెందిన గేదెలు

మేడ్చల్, జూన్ 18, ప్రభాతవార్త:
విద్యుత్ తీగలకు తాకి రెండు పాడి గేదెలు మృతి చెందాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి గ్రామానికి చెందిన సుశీలమ్మ పాడి గేదెలను పెంచుకుని జీవనం పొందుతున్నది. గేదెలను మేత కోసం గ్రామ శివారులోని మైలోస్టోన్ వెంచర్ సమీపంలోకి తీసుకెళ్లారు. అక్కడ మేత మేస్తున్న గేదెలు తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. తమకు జీవనోపాధి కల్పించే గేదెలు కరెంట్ షాక్‌తో మృతిచెందడంతో తమ జీవనం అగమ్యగోచరంగా మారిందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తమ గేదెలు చనిపోయాయని బాధితురాలు ఆరోపించారు. తమను విద్యుత్‌శాఖ అధికారులు గాని, ప్రభుత్వం గాని ఆదుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన టిఎన్‌జిఓస్ నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త:
మేడ్చల్‌జిల్లా నూతనకలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని మర్యాదపూర్వకంగా జిల్లాఉద్యోగుల జాయింట్ యాక్షన్‌కమిటీ చైర్మన్ రవిప్రకాశ్, సభ్యులు, టిఎన్‌జిఓస్ నాయకులు పలువురుకలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వారు నూతనకలెక్టర్ మనుచౌదరిని కలిసారు. దీనిలో జిల్లా జెఎసి చైర్మన్ రవిప్రకాశ్, టిఎన్‌జిఓస్‌నాయకులు జిల్లాకార్యదర్శి భరత్ కుమార్, జిల్లా కోశాధికారి శేషసాయిగిరికాంత్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు కార్తీక్, జిల్లా సభ్యులు అశ్విని, అత్తారి, నాగరాజు, వినయ్‌కాంత్, కిషోర్, లక్ష్మయ్య, కోశాధికారి లింగాల అక్షయ్‌కుమార్, ఉమాకాంత్, చంద్రకాంత్, లక్ష్మిప్రసన్న, భాస్కర్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి సన్మానించిన దృశ్యం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

-డిప్యూటీ కమిషనర్ రవికుమార్

అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త : సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ నదుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై బుధ్వేల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని సూచించారు. దోమల ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చిత్త వేయకుండా చెత్త సేకరించే ఆటోలకు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్, ఏఈ ఉదయ్ కుమార్, ఎంటమాలజీ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని బిజెపి నేతలు పేర్కొన్నారు.బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం శివారం పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం ,ఆరంఘర్ దగ్గర మొక్కలు బిజెపి నేతలు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....భవి తరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ప్రధాని నరేంద్ర మోడీ 11ఏళ్ల పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పేదలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్,హరి కిషన్ జి,సోల్కర్ రెడ్డి, వి.జగన్, శ్రీకాంత్ రెడ్డి,కోరాని క్రాంతి,బాబు రావు,బండారి బాల కృష్ణ,రజిని కాంత్,మల్లేష్ చారి,వెంకటేష్ సురేందర్, తిరు మలేష్, రాకేష గౌడ్,యాదయ్య,కవిత,రమాకాంత్ ,గణేష్,తుంగ ఇంద్ర రెడ్డి ,సరిత రెడ్డి ,రాజశేఖర్రెడ్డి,పవన్ ,శ్రీనివాస్ రెడ్డి,పి వంశీ ,రాజు నాయక్ మరియు నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బిజెపి నేతలు

అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త : భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పలువురు బిజెపి నాయకులు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు అత్తాపూర్ డివిజన్ లో అమ్మకు ఒక చెట్టు అనే నినాదంతో డివిజన్ అధ్యక్షులు సుల్లే వెంకటేష్ ఆధ్వర్యంలో బిజెపి నేతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి జిల్లా సెక్రెటరీ కొమరయ్య అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ విజయ్ కుమార్ కిరణ్ చారి జయానంద రెడ్డి ఆర్ జగన్ జి రాజు పి వెంకట్ రెడ్డి శశికాంత్ శర్మ విజయ స్వామి నరేశ్ గురుప్రీత్ యాదగిరిరెడ్డి ప్రవీణ్ రాం బాబు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు

మానసిక ప్రశాంతత, ఆరోగ్యాన్ని పెంచేందుకు యోగా దోహదం : మాధవరం కాంతారావు

కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త

ప్రస్తుత సమాజంలో యాంత్రికమైన జీవనశైలితో ప్రతిఒక్కరూ ఒత్తిళ్ళకు గురవుతున్నారనీ మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం పెంచేందుకు యోగా దోహదపడుతుందని కూకట్పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పేర్కొన్నారు. 2025లో అంతర్జాతీయ యోగా దినోత్సవం యొక్క థీమ్ యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ ఉంటుందని యోగా ద్వారా మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, భారతీయుల జీవిన విధానాన్ని ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొచ్చిందనీ భారత ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో ప్రతి సంవత్సరం కూకట్పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యోగా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 21, ఉదయం 6 గంటలకు, కూకట్పల్లి ఎన్.కే.ఎన్.ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆరోగ్యాభిలాషులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కాంతారావు విజ్ఞప్తి చేశారు.

ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

నార్సింగి మున్సిపల్ కార్యాలయం ముందు మహిళా ఉద్యోగులు, సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త : వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం నార్సింగి మున్సిపల్ భవనం ముందు మహిళా ఉద్యోగులు, సిబ్బందికి "ముగ్గుల పోటీలు" నిర్వహించారు. కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టిపిఓ మణిహారిక ముగ్గుల పోటీల న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సెప్టెంబర్ 10.వ,తేదీన సత్కారం, జ్ఞాపికలు అందజేస్తారు. ఈ ముగ్గుల పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా ముగ్గులు వేశారు. స్వరూప, కవిత, జోత్స్న, సుశ్మ, శిరీష, అనూష, రాణి, రాజశ్రీ, మీనాక్షమ్మ, రమాదేవి, జ్యోతి, మంజూల తదితరులు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్లాస్టిక్ నిషేదం, పర్యావరణ పరిరక్షణ, తడి,పొడి చెత్త వేరు చేయడంపై విద్యార్థులకు వ్యాసరచన, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సైతం 100.రోజుల ప్రణాళిక ముగింపు రోజు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించనున్నట్లు టిపిఓ మణిహారిక వివరించారు.

రోడ్డు డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులు చేపట్టాలి

-పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, డీసీ గంగాధర్, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, పారిశుధ్య విభాగం అధికారులతో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజుల రామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందని చెప్పారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి 100ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, ప్రణాళికను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. యుద్ధప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, రోడ్డు విభాగిని పనులు నాణ్యత ప్రమాణాలుతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానార్ గణపతి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు గోవర్ధన్ రాజీవ్, శ్రావణి, నిఖిల్, వర్క్ ఇన్స్పెక్టర్లు మహాదేవ్, రవి కుమార్, గురువా రెడ్డి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు జనప్రియ, దయ నంద్, లైన్స్ మధుకర్, కరణ్ కుమార్, స్ట్రీట్ లైట్స్ స్వప్న శ్రీనివాస్, నాయక్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న అరికెపూడి గాంధీ

ప్రణాళిక బద్ధంగా బండ్లగూడను అభివృద్ధి చేస్తున్నా : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌ను ప్రణాలికబద్దంగా అభివృద్ధి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్పోరేషన్ పరిధిలోని 12,17,18,19,20. 22.డివిజన్ల పరిధుల్లో రూ.7.కోట్ల 44.లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజి, సీసీ రోడ్డు పనులకు కమీషనర్ శరత్ చంద్ర, మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున నిదులు వెచ్చిస్తున్నామన్నారు. గతంలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండేదని, దీంతో వర్షాకాలం వస్తే ఎక్కడికక్కడా మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లేవని, వేసవిలో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. ప్రణాలిక బద్దంగా పని చేస్తూ, భూగర్భ డ్రైనేజి వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించామని, మంచినీటి సమస్య రాకుండా జల మండలి ఉన్నతాధికారులతో మాట్లాడి నీటి క్వాంటిటీని పెంచుకోవడం జరిగిందన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్‌లు, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్డు పనులకు పెద్దపీఠ వేస్తున్నామన్నారు. అధికారులు చక్కగా పని చేస్తున్నారని, వారికి నాయకులు, ప్రజలు సహకరించి అభివృద్ధిని మరింత వేగంగా చేయించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయం చేద్దామని, ఇప్పుడు కుల, మత,పార్టీలకు అతీతంగా అభివృద్ధిని చేసుకుందామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి, మాజీ కార్పోరేటర్లు సా గర్‌గౌడ్, శ్రీలత సురేష్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, పాపయ్యాదవ్, గోపాల్, నవీన్, శ్రీనివాస్, రాంప్రసాద్, నరేష్, సుమన్‌గౌడ్, హరీష్‌గౌడ్, విష్ణు పాల్గొన్నారు.

బండ్లగూడ కార్పోరేషన్‌లో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు.

కెపిహెచ్‌బి కాలనీ గృహ సముదాయాల రిజిస్ట్రేషన్లు చేయాలని బండి రమేష్ వినతి

కెపిహెచ్బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త

నియోజకవర్గ సమస్యల పరిష్కార కోసమై టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ బోర్డ్ ఎండి గౌతమ్‌ను బుధవారం వారి కార్యాలయాల్లో కలిశారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్బి కాలనీ గృహ సముదాయాల రిజిస్ట్రేషన్లు ఎప్పటినుంచో పెండింగ్ ఉండడాన్ని రమేష్ వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్థానిక నివాసుల సౌకర్యార్థం వాటిని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం హై లెవెల్ కమిటీని నియమించాలని వారిని బండి రమేష్ కోరారు. హౌసింగ్ బోర్డు ఇళ్ళు లబ్ధిదారులకు కేటాయించి సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ రిజిస్ట్రేషన్స్ కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 630 అల్పాదాయా వర్గాల గృహాలతోపాటు, 270 సంపూర్ణ గృహాలు హిందూ ప్రాజెక్టులోని విల్లాలు, ఫ్లాట్స్, మంజీరా ఫ్లాట్స్ కేవలం చిన్న చిన్న కారణాలతో రిజిస్ట్రేషన్స్ ఆగిపోయాయన్నారు. అలాగే జేఎన్టీయూ పక్కన ఉన్న సాయి నగర్ ప్లాట్స్ రిజిస్ట్రేషన్ చిడ్కో ప్రాజెక్ట్ విషయంలోనూ త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు వారికి బండి రమేష్ వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తగు సూచనలు ఇచ్చినట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

మంత్రి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బండి రమేష్

కమిషనర్ వెంకట్రావు పదవీ కాలాన్ని పొడిగించాలని అర్చక జెఎసి విజ్ఞప్తి

గన్‌ఫౌండ్రి,జూన్ 18ప్రభాతవార్త: అతి స్వల్ప కాలంలో పెండింగ్‌లో ఉన్న అనేక ఫైళ్లను పరిష్కరించడం,జిల్లా వారిగా అర్చక వెల్ఫేర్ బోర్డు పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు పెండింగ్‌లోఉన్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కమీషనర్ ఎస్. వెంకట్రావు అన్నారు.ఈమేరకు దేవాదాయశాఖ కమీషనర్ ఎస్.వెంకట్రావును అర్చక ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు.జెఏసి చైర్మన్ గంగుఉపేంద్రశర్మ,కన్వీనర్ పరాశరం రవీంద్రచార్యులు,కాండూరి కృష్ణమాచార్యులు, కార్యనిర్వాహక అధ్యక్షులు అగ్నిహోత్ర చంద్రశేఖర్,ఇతర జెఏసి నాయకులు,అర్చకులు,ఉద్యోగులు కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమీషనర్ ఎస్.వెంకట్రావు పదవి విరమణ ఆగస్టు 2025న పదవి విరమణ చేయనున్నట్లు తెలిపారు.అందుకు కమీషనర్ వెంకట్రావు పదవి కాలం పొడగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.పదవి కాలని మరో రెండు సంవత్సరాల పాటు పొడిగించాలన్నారు.సమర్దులైన అధికారిని కొనసాగిస్తే దేవాదాయశాఖ తెలంగాణకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.అంతేకాకుండా కాండూరి కృష్ణమాచార్యులు స్వయంగా చిత్రకటించిన కమీషనర్ చిత్రపటాన్ని అందచేశారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అర్చక వెల్ఫేర్ బోర్డు లబ్ధిదారులకు త్వరలో పరిష్కరించేందుకుగాను మంత్రి కొండా సురేఖ,ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.ఈకార్యక్రమంలోతదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కమీషనర్ ఎస్.వెంకట్రావును సన్మానించిన అర్చకులు

పెన్షనర్లకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి

-ప్రధానికి లక్షలాది సంతకాలతో వినతిపత్రాలను పంపుతాం

-తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్ణయం

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ కె.లక్ష్మయ్యకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్

హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్మన్ కె.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో పెన్షనర్లు ఎదుర్కొటున్న సమస్యలతో పాటు ఇతర అంశాలను చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 23న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లక్షలాది పెన్షనర్ల సంతకాలతో వినతిపత్రాలను పంపే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ తులసీ సత్యనారాయణ, తెలంగాణ విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పెన్షనర్లకు సంబంధించి వినతి పత్రాన్ని సమర్పించారు

ఎమ్మెల్యే గోపీనాథ్ సేవలు మరువలేనివి

-నివాళులర్పించిన పలువురు నేతలు

దివంగత నేత మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పలువురు నేతలు

శేరిలింగంపల్లి, జూన్18 ప్రభాతవార్త

జూబ్లిహిల్స్ శాసనసభ్యులు,దివంగత నేత మాగంటి గోపీనాథ్ సేవలు మరువలేనివని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. స్వర్గీయ గోపీనాథ్ దశదినకర్మ కార్యక్రమాన్ని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ,మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు,ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దివంగత మాగంటి గోపీనాథ్ అకాల మరణం అత్యంత బాధాకరమని, అనారోగ్యంతో ఆయన మరణించారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఆయన లేనిలోటు తీర్చలేనిదన్నారు. మాగంటి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మృధుస్వభావి, సౌమ్యుడు,రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన వారి జీవితం ఎంతో మందికి ఆదర్శమన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లిహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం ఎనలేని కృషిచేశారని గుర్తుచేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పలువురు నాయకకులు తమ ప్రగాఢ సానుభూతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, పాతూరి వెంకట్రావు,సాంబశివరావు, విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం

అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త : శ్రీ కొండా లక్ష్మాణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం హైదరాబాద్, అంతర్జాతీయ విద్యా సహకారాన్ని పెంపొందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేసింది, ఇది యూఎస్ఏ లోని కాన్సాస్‌లోని మాన్‌హట్టన్‌లో ఉన్న కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ (కె ఎస్ యూ) తో ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది. ఈ భాగస్వామ్యం ఉద్యాన మరియు వ్యవసాయ శాస్త్ర రంగాలపై ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయం యొక్క విద్యా, పరిశోధన మరియు సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ద్వైపాక్షిక ఒప్పందం పరస్పర నైపుణ్యం, ఆవిష్కరణ మరియు సంస్థాగత సామర్థ్య నిర్మాణానికి మార్గం చేయాలని గౌరవ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. ఈ సహకారం యొక్క ముఖ్య లక్ష్యాలు ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టుల కోసం, విద్యార్థులు అధ్యాపకుల, శాస్త్రవేత్తల మార్పిడి, అతిథి ఉపన్యాసాలు, స్వల్పకాలిక విద్యా సందర్శనల కోసం మరియు అంతర్జాతీయ సమావేశాలు, సింపోజియాలు మరియు బోధనా కార్యక్రమాలలో పాల్గొనడం. ఈ అవగాహన ఒప్పందం ద్వారా రెండు విశ్వవిద్యాలయాలు సహకార పరిశోధన కోసం భవిష్యత్తులో నిర్దిష్ట ఒప్పందాలను చర్చించి, విద్యా వృద్ధి, ఆవిష్కరణ మరియు స్థిరమైన అభివృద్ధికి కొత్త మార్గాలను రూపొందించాలని డాక్టర్ రాజి రెడ్డి గారు అన్నారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్, కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ, పి.వి. వర ప్రసాద్, విశ్వవిద్యాలయ విశిష్ట ప్రొఫెసర్, మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రఘువర్ధన్ రెడ్డి, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ చీనా నాయక్, యూనివర్సిటీ కన్సల్టెంట్ కె. వీరాంజనేయులు, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్ శ్రీనివాసన్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్స్ డాక్టర్ పి ప్రశాంత్, డాక్టర్ పిడిగం సైదయ్య మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటోల పర్మిట్లను అడ్డుకుంటే ఫైనాన్సియర్ల తాటతీస్తాం

సైఫాబాద్, జూన్ 18 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఉచిత ఆటో పర్మిట్లను ప్రైవేటు ఆటో ఫైనాన్సియర్లు అడ్డుకుంటే తాటతీస్తామని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ సంఘాల జెఏసి హెచ్చరించింది. వడ్డీ రాబందువుల్లైన ఆటో ఫైనాన్సియర్లు తమ అక్రమ వ్యాపారంతో ఆటో డ్రైవర్లను నిలువు దోపిడి చేసేందుకే పర్మిట్లను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జెఏసి నాయకులు ఆరోపించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఏసి కన్వీనర్ బి.వెంకటేశం, నాయకులు వి.మారయ్య, అజయ్‌బాబు తదితరులు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఫైనాన్సియర్ల అరాచకాలు కొనసాగిస్తూనే ఉన్నారని, కాలం చెల్లిన ఆటోలను తుక్కుగా మార్చి ఆ పర్మిట్లపై కొత్త ఆటోలను కోనుగోలు చేస్తూ ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ కోట్ల మేరకు అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. వేల ఆటోల పర్మిట్లు ఫైనాన్సియర్ల వద్ద ఉన్నాయని, ఫైనాన్స్ సంస్థల నుంచి అప్పులు తీసుకుని ఆటోలను కొనుగోలు చేసిన డ్రైవర్లు కిస్తులు చెల్లించలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగాన్ని రూపుమాపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉచిత ఆటో పర్మిట్లను జారీ చేయనుందని, దీంతో తమ అక్రమ వ్యాపారం జరగదని భావించిన ఆటో ఫైనాన్సియర్లు జీవొను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రయత్నాలను ఆపకుంటే వారి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

కోడెల సంరక్షణకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక రూపొందించాలి

టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

ముషీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:

వేములవాడ రాజరాజేశ్వర దేవాలయంలో కోడెల సంరక్షణకై శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక రూపొందించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడెల రాజన్న స్వామికి కోడె మొక్కు చెల్లిస్తే కోర్కెలు తీరుతాయని భక్తులు నమ్ముతూ ఉంటారని గుర్తు చేశారు. ఈ కోడెలతో కోట్లాది రూపాయల ఆదాయం ఆలయానికి వస్తున్నప్పటికీ కోడెల సంరక్షణ విషయంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం విచారకరమని అన్నారు. వారం రోజుల వ్యవధిలో దాదాపు పదిహేనుకుపైగా కోడెలు మృత్యువాత పడినా, ఆలయ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా పూడ్చి పెట్టటం జరుగుతోందని ఆరోపించారు. దేవాదాయ శాఖా మంత్రి కానీ, ముఖ్యమంత్రి కానీ దీనిపై స్పందించక పోవటం దారుణమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధి కోసం మాజీ సర్పంచులు చేసిన బిల్లుల బకాయిలు అధికారంలోకి రాగానే చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులను ఆదుకోకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తక్షణమే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, బిల్లులు చెల్లించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

యోగ సాధన ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న హరికృష్ణ

మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన హరికృష్ణ

సిద్దిపేట రూరల్, జూన్ 18, ప్రభాతవార్త : బుధవారం మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న గడ్డం వివేక్‌ను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజాల హరికృష్ణ హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ దుబ్బాకనియోజకవర్గ ఇన్‌చార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఎసిపిని కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు

ఎసిపిని సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త : హుస్నాబాద్ ఎసిపిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సదానందంను బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలుర పాఠశాలలో నిర్వహించే కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఎసిపిని కలిసినవారిలో ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, పిడిలు కె.రాజారెడ్డి, శ్రీనివాస్, సంపత్, కళావతి, భాగ్య, శీల, శ్రీలత, ఫర్జానా, మహేష్, పిఈటిలు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రభుత్వం రైతుభరోసా నిధులు రైతుల అకౌంట్‌లలో జమచేయడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే వెనక్కి తీసుకోదని, ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీనే మరో పదేళ్లు అధికారంలోకి రావడం ఖాయం అని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ అలంకుంట మహేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, యువజన కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు గయాజుద్దిన్, నాయకులు గయాజుద్దిన్, హర్షద్, సలీం, ఫయాజ్, అనిల్, విజ్ఞేష్, చందు, సుధీర్, నజ్జు పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి : ఎస్ఐ

మాట్లాడుతున్న ఎస్ఐ తోట మహేష్

హుస్నాబాద్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త : ప్రజల రక్షణే తమ బాధ్యత అని ఎస్ఐ తోట మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని రాములపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, పార్టీల నాయకులు గొడవలు పెట్టుకోవద్దని శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించుకోవాలన్నారు. అలాగే నేరాల నియంత్రణకు సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలన్నారు. అంతేకాకుండా ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒకవేళ సైబర్ నేరాలకి గురైతే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ప్రజలకు సేవలు అందించేందుకు పోలీస్‌శాఖ ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హుస్నాబాద్ ఎసిపి సదానందం

అక్కన్నపేట, జూన్ 18, ప్రభాతవార్త : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ ఎసిపి సదానందం అన్నారు. బుధవారం రోజున అక్కన్నపేట మండల కేంద్రాన్ని హుస్నాబాద్ సీఐ కోండ్ర శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో ఎమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో శాంతి భద్రతలకు ఆటంకాలు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే పోలీసుల ధ్యేయం అని ప్రజలు సమస్యలలో ఉన్నప్పుడు ఎప్పుడైనా పోలీసుల సహకారం పొందవచ్చన్నారు. మండల కేంద్రంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అక్కన్నపేట ఎస్ఐ విజయ్ భాస్కర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎసిపి సదానందం

నీరుగారిపోతున్న రాజీవ్ యువ వికాస పథకం

జహీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్‌యువ వికాస పథకం ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరుగారి పోతోందని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నామ రవికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2 లక్షలమంది లబ్దిదారులను ప్రకటించి పతకం మంజూరు పత్రాలను అందచేస్తామని ప్రకటించి అమలుచేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపించారు.16లక్షల మంది యువత పథకం మంజూరుకు నమోదు చేసుకున్నారని, నమోదు చేసుకునేందుకు ప్రతి ఒక్కరు 2 నుంచి 3వందల రూపాయల వరకు ఖర్చు చేసుకోవడంతో ప్రభుత్వానికి 30 కోట్ల వరకు ఆదాయం సమకూరిందని, నిరుద్యోగులకు మాత్రం నిరాశే మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని యువ

కులను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు ఒక ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేకపోయిందని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ హయాంలో విడుదలచేసిన నోటిఫికేషన్‌ల ద్వారానే ఉద్యోగాలు సమకూరాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు రాకేష్, బిఆర్ఎస్‌వి పట్టణ అధ్యక్షులు ఓంకార్ మడివాళ్, నాయకులు అప్పిరాజుఏ, ఫయాజ్, ప్రవీణ్, చింటూ,రాజా తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలో ఇద్దరు విద్యార్థుల ఎంపిక

నర్సాపూర్ జూన్ 18, ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం మండల విద్యాధికారి తారాసింగ్ ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో మండల పరిధిలో ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది. ఈ మేరకు నర్సాపూర్ లోని విష్ణు హైస్కూల్ చెందిన విద్యార్థి టి.హాసిని, మండల పరిధిలోని కాజీపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన విధ్యార్థిని జె.నందిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ తారాసింగ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఎంఈఓ తారా సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్ఎం చంద్రశేఖర్, పిడి ఆంజనేయులు, ఏంఐసి కోఆర్డినేటర్ సుధాకర్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ జలాశయం లోపలికి ప్రవేశం నిషేధం

-ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు, జూన్ 18 (ప్రభాతవార్త): ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా కొండపోచమ్మ జలాశయం లోపలికి ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని ఈ విషయాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, పర్యాటకులు గమనించాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కొండపోచమ్మ జలాశయం ప్రవేశాన్ని పూర్తిగా నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని, ముఖ్యంగా రిజర్వాయర్‌లోకి దిగడం, స్నానాలు చేయడం, పడవ ప్రయాణాలు, వినోద కార్యక్రమాలు పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. రిజర్వాయర్ చుట్టూ నిషేధమని బోర్డులు ఏర్పాటు చేశామని, అలాంటి స్థలాలకు దిగడం చట్ట విరుద్ధమని, రిజర్వాయర్ లోతు ఉండడం వల్ల ఇందులో ఇప్పటికే ఎందరో మృత్యువాత పడడం వల్ల ఈ చర్యలు తీసుకోవల్సి వచ్చిందని, ఇది అందరూ గమనించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా రిజర్వాయర్‌లోకి దిగితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా జలాశయంపై అనుమానాస్పదంగా సంచరించినా లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

మర్కుక్, జూన్ 18 (ప్రభాతవార్త): జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ నాలుగవ తరగతిలో ప్రవేశం కోసం మండలస్థాయిలో పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించగా ఇందులో నలుగురు విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతిసైద, ఫిజికల్ డైరెక్టర్ రజినిలు తెలిపారు. జిల్లా స్థాయిలో ఈనెల 24న ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, మండల రిసోర్స్ పర్సన్ నాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెట్టుబడులకు వేళాయే

రుణాల అన్వేషణలో రైతన్నలు

సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18, ప్రభాతవార్త : మృగశిరకార్తె ప్రవేశించిందంటే వలు పనులకు శ్రీకారం చుడుతూ పెట్టుబడులకు దారులు తెరుచుకుంటాయి. ఈనెల 3న మృగశిరకార్తె ప్రవేశించింది. వాతావరణము చల్లబడింది. రైతులు వానాకాలం వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. దుక్కులు దున్నటం ప్రారంభించారు. జీలుగ విత్తనాలు చల్లారు. ఈ నెలాఖరు నాటికి వ్యవసాయ పనులు మరింత పుంజుకుంటాయి. ఇక రైతులు పంటల సాగుకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యారు.ఎక్కువగా వ్యవసాయ పంట పెదుతుంటారు. ఇప్పటికి వ్యవసాయ భావులు, బోర్ల కింద పంటలు వేసే రైతులు పెట్టుబడులు కొరకు అన్వేషణలు ప్రారంభించారు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ప్రైవేటు విద్యా సంస్థల్లో పిల్లలను చేర్చాలంటే తల్లితండ్రులు పెద్ద పెట్టుబడి పెట్టక తప్పదు. ప్రైవేటు పాఠశాలల్లో పీజుల మోత మోగుతుంది. అయినప్పటికి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో నేర్పించేదుకు ఆసక్తి చూపడంతో పుస్తకాలు, బ్యాగులు యూనిఫామ్ తదితరవాటితో తడిసి మోపెడు అవుతున్నాయి అవుతున్నాయి. ప్రభుత్వము ప్రభుత్వ పాఠశాలల ఒలోపేతానికి అన్ని చర్యలు తీసుకుటుంది. ఆంగ్ల మాధ్యమంలో నిత్యాబోరన పాఠశాల మధ్యాహ్న, భోజనం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు ఉచితంగా. అందచేస్తున్నారు. ఏ మాత్రం పెట్టుబడు లేకుండా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవచ్చు. కానీ ప్రైవేటు పాఠశాల మోజులో జాయిన్ అవ్వతుందడంతో తల్లిదండ్రులకు ప్రైవేట్ పాఠశాలల ఖర్చులు, పీజులు చెల్లింపు తలకు మించిన భారంగా తయారయింది. పాఠశాలల ఖర్చులు వ్యవసాయ పెట్టుబడులు రెండు ఒకటేసారి రావడంతో కావరంతో పెట్టుబడుల కాలంగా చెప్పవచ్చు.

తప్పుడు పత్రాలతో అనుమతులు ఇచ్చిన

అధికారులపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ జూన్ 18, ప్రభాతవార్త : తప్పుడు పత్రాలకు ఇండ్లు లేకున్నా ఇంటి నెంబర్ లు అనుమతులు ఇస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్స హిస్తున్న సంగారెడ్డి మున్సిపల్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ లోని, సి డి ఎం ఏ కి బుధవారం ఫిర్యాదు. చేసినట్లు సామాజిక కార్యకర్త ఎం శ్రీధర్. ఒక ప్రకటనలో తెలిపారు సంగారెడ్డి పట్టణం లో తప్పుడు పత్రాలు సృష్టించి మోసపూరితంగా మున్సిపల్ కార్యాలయం నుండి ఇండ్లు లేకున్నా ఇంటి నెంబర్ లు ఇస్తూ ప్రభుత్వ భూముల్లో అనుమతులు ఇస్తున్న సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయం రెవిన్యూ మరియు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.కోరినట్లు ఆయన తెలిపారు.

సర్టిఫికెట్లు దొరికితే అందచేయండి

-విద్యార్థిని మైత్రి అంబిక

సిర్గాపూర్, జూన్ 18, ప్రభాతవార్త: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఎంసెట్‌కు ధరఖాస్తు చేసుకునేందుకు వెళ్లే తరుణంలో తనకు చెందిన సర్టిఫికెట్లు పోయినట్లు మండల పరిధిలోని గొడ్గగామ గ్రామానికి చెందిన మైత్రి అంబిక పేర్కొన్నారు. తన సర్టిఫికెట్లు నారాయణఖేడ్‌లో లేదా సంగారెడ్డిలో పోగొట్టుకున్నానని, తన సర్టిఫికెట్లు ఎవరికై లభిస్తే 9346476726కు సమాచారం అందించాలని వినతి చేశారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

నర్సాపూర్, జూన్ 18, ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం రెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒకటిన్నర సంవత్సర కాలంలో ఆన్దిరంగా స్థోమత లేని పూర్తిగా ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకుంటున్నారని తెలిపారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేస్తామన్న ఆ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక నిరుపేద కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేసిందన్నారు.

రెడ్డిపల్లిలో ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభిస్తున్న ఆంజనేయులు గౌడ్

ఈ మేరకు ఇల్లు లేని నిరుపేదలైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆంజనేయులు గౌడ్ అన్నారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, రుస్తుంపేట మాజీ ఎంపీటీసీ అశోక్, రెడ్డిపల్లి గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్, దాడిగా నరేష్, శివ ప్రసాద్ గౌడ్, మన్నె శ్రీనివాస్, మహేష్, ఆంజనేయులు, అంజి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న కళాకారులను ఆదుకోవాలి

జగదేవ్‌పూర్, జూన్ 18 (ప్రభాతవార్త): రాష్ట్రంలో 30 ఏళ్ళుగా కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని కొండపోచమ్మ ఆలయం వద్ద తెలంగాణ రాష్ట్ర ఫోక్ఇండస్ట్రీ కార్యనిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు చేపడుతున్న ప్రతి పథకాన్ని పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకుపోవడానికి ప్రతి కళాకారుడు కీలకపాత్ర పోషిస్తున్నారని,కళనే నమ్ముకొని జీవనం సాగిస్తూ తెలంగాణ ఉద్యమంలో 20 సంవత్సరాలకు పైగా కళాకారులు ఎనలేని కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో కళాకారులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. ప్రభుత్వం ఒక్కో కళాకారునికి హైద్రాబాద్‌లో 500 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని, వడ్డీలేని రుణాలు మంజూరుచేయాలని, వృద్ధ

మాట్లాడుతున్న ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్

కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలని, ప్రభుత్వం ద్వారా గుర్తింపు కార్డులను ఇస్తూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో కళాకారులను ప్రోత్సహించేలా ప్రతి నెలకు ఒక సభను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సత్తార్‌బాయ్, కోశాధికారి గజ్వేల్ వేణు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిఎల్ నాందేవ్, ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీ సలహాదారులు దరువు అంజన్న, వరంగల్ శ్రీనివాస్, జంగిరెడ్డి, కోదాడ శ్రీను, కళాంజలి రాజేష్, చీకోడు నర్సింలు, కదూరి గణేష్, వస్పరి విష్ణు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు జడల రమేష్, శంకర్‌బాబు, మంకాల ప్రసాద్, మల్లికేతేజ, నగేష్, నవీన్ సాంబారే, శ్రీధర్, ఘన్‌శ్యామ్, కోడం సంతోష్, అజయ్, మధు, మధుబాబుశాస్త్రి, చీకోటి నర్సింలు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

డిఎల్‌పిఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా కేటాయించారు ...!?

అక్కన్నపేట, జూన్ 18, ప్రభాతవార్త : మండలంలోని కేశ్‌నాయక్‌తండాలో అర్హులకుకాకుండా అనర్హులకు పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హుస్నాబాద్ డివిజన్ పంచాయతీ ఆఫీసర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉండడానికి ఇళ్లులేనివారికి ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇళ్లను కార్యదర్శి ఇల్లుతో పాటు ఆరెకరాల పొలం ఉన్న అనర్హులైన ఇద్దరికి ఇచ్చారని, వారికిచ్చిన విషయం ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కూడా తెలియదన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి ఇందిరమ్మ ఇండ్లలో అనర్హుల పేర్లను తొలగించి అర్హులకు కేటాయించడంతో పాటు పంచాయతీ కార్యదర్శిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొమురవెల్లి మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్న ఎసిపి

ఎసిపికి మల్లిఖార్జున స్వామి జ్ఞాపికను అందిస్తున్న అర్చకులు

కొమురవెల్లి, జూన్ 18, ప్రభాతవార్త: కొమురవెల్లి శ్రీమల్లిఖార్జున స్వామి వారిని బుధవారం హుస్నాబాద్ ఎసిపి సదానందం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఎసిపిని అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలతోపాటు స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో కొమురవెల్లి ఎస్ఐ రాజుతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్‌గౌడ్

మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

కోహెడ, జూన్ 18, ప్రభాతవార్త : కల్లుగీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమండ్ చేశారు. బుధవారం నకరగొమ్ముల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన గీత కార్మికు లకు పింఛన్లు ఇవ్వడంతో పాటు ఇచ్చిన హామీ మేరకు గ్రామాలలో బెల్ట్ షాపులు మూసివేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, రవిగౌడ్, బుర్ర శ్రీనివాస్, రాజయ్య, కిష్టస్వామి, రాములు, బాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

ధూళిమిట్ట, జూన్ 18,ప్రభాతవార్త : ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో గాయాలై సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుకుంటూ హుస్నాబాద్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు లకావత్ వెంకటేష్ నాయక్, ఇస్లావత్ మహేష్‌నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారితో పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రైతు భరోసా దరఖాస్తుకు ఈ నెల 20 చివరి తేది

ధూళిమిట్ట,జూన్ 18,ప్రభాతవార్త : నూతనంగా పట్టదారు పాసుబుక్కులు పొందిన రైతులు ఈనెల 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఈనెల 20లోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో బూరెల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పట్టాదారు పాసుబుక్, బ్యాంక్ పాసుబుక్,ఆధార్‌కార్డు జిరాక్స్‌లను స్థానిక ఏఈవోలకు ఇచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు బుక్స్, పెన్నుల పంపిణీ

గజ్వేల్ టౌన్, జూన్ 18 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి జన్మదినం సందర్భంగా బుధవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల అధ్యాపకుడు బ్రాహ్మండ్లపల్లి బిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌ల అధ్యక్షతన ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, అరీఫ్, సభ్యుల ఆధ్వర్యంలో నోటుబుక్స్, పెన్సులు, పెన్సిల్స్, వాటర్ బాటిల్స్, డ్రాయింగ్ మెటీరియల్, ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశం, జోన్ చైర్మన్ నేతి శ్రీనివాస్, ఐవిఎఫ్ రాష్ట్ర బాధ్యులు తోట బిక్షపతి, గ్రామ నాయకులు రమేష్, ప

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను చేస్తున్న భక్తులు

షాద్‌నగర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:
షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులోని శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో 22వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపురోజు బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కట్టా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో దంపతులు, భక్తులు పాల్గొనగా వారిచే ఆలయ అర్చకులు రాఘవేంద్రచార్యులు, సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే స్వామివారికి మంగళవారం మహిళలు పోసిన వడిబియ్యం వండి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వాహకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ నాయకత్వంలో శరవేగంగా దేశాభివృద్ధి

-బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు యు.రమేష్‌కుమార్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప్పరి రమేష్‌కుమార్

పెద్దేముల్, జూన్ 18, ప్రభాతవార్త:
ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో శరవేగంగా దేశాభివృద్ధి జరుగుతోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు యు.రమేష్‌కుమార్ అన్నారు. వికసిత్‌భారత్ కార్యక్రమంలోభాగంగా పెద్దేముల్‌మండలం మదనంతాపూర్‌లో మండల బిజెపి అధ్యక్షుడు వీరేశం అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యు.రమేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యు.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెదపీట వేస్తూ, వారు ఆర్థికంగా నిలబడేం దుకు మేకింగ్ ఇండియా ద్వారా ముద్రలోన్‌తో అనేకమంది ఆర్థికంగా నిలబడ్డారని అన్నారు. రాబోవురోజుల్లో తెలంగాణలో బిజెపిపార్టీ అధికారం లోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, గిరిజనమోర్చా నాయకులు రామ్యనాయక్, కార్యవర్గసభ్యుడు సందీప్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శులు వెంకట్ రెడ్డి, శివరాజ్, ఉపాధ్యాక్షులు లొంక మహిపాల్, ప్రవీన్, యాదయ్యగౌడ్, భూమే నర్సిములు, సంతోష్, ధాన్యనాయక్, లక్ష్మన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



డాక్టర్ మిర్యాల వెంకటరమణను సన్మానిస్తున్న బాబర్‌ఖాన్, తదితరులు

షాద్‌నగర్, జూన్ 18, ప్రభాతవార్త:
ఇటీవల ఉత్తమ డాక్టర్‌గా అవార్డు అందుకున్న డాక్టర్ మిర్యాల వెంకట రమణను షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, పట్టణ ప్రముఖులు గజవాడ హనుమంతు, కిషన్‌లు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యులు ఎంతో కీలకమని, ఆపత్కాలంలో వైద్యులు దైవంతో సమానమని అన్నారు. సమాజానికి చేసిన సేవను గుర్తించి పురస్కారాలు అందజేయడం వల్ల వారికి మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలబట్ల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తడి,పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న మార్కెట్‌కమిటీ ఈగ శ్వేతరాజుముదిరాజు

కీసర, జూన్ 18, ప్రభాతవార్త:
ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతరాజుముదిరాజు అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన 100 రోజుల తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తడి, పొడిచెత్త, ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా కీటకాలు దరి చేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వెల్జర్లలో బిసి కాలనీ మహిళా కమిటీ ఏర్పాటు

షాద్‌నగర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:
ఫరూఖ్‌నగర్ మండలం వెల్జర్ల బిసి కాలనీలో నూతన మహిళా కమిటీని ఏర్పాటుచేశారు. ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షురాలు జక్కల జలజ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌదరిగూడ మండల అధ్యక్షురాలు ప్యాట జయశ్రీకాంత్, షాద్‌నగర్‌టౌన్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, ఫరూఖ్ నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతిరాజ్ తదితరులు హాజరయ్యారు. నూతనంగా అధ్యక్షురాలుగా దొడల మంజుల, ఉపాధ్యక్షురాలుగా చాకలి అనిత,నప్రధాన కార్యదర్శిగా డి.సద్గుణ, కార్యదర్శిగా సంజన, సహాయ కార్యదర్శిగా సి.జ్యోతి, కోశాధికారిగా కర్ణం కళావతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 18, ప్రభాతవార్త:
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎదిర సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాలకు గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని బుదవారం ఎఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోగల జాకారం, గుంజల్‌పహాడ్, ఫీర్జాపూర్, కాస్లాబాద్, ఎదిర, రావిర్యాల, చలివేంద్రంపల్లి గ్రామాలలో ఉదయం9గంటల నుంచి సాయంత్రం4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వైర్లకు దగ్గరలోని చెట్ల తొలగింపుపనులు చేయనున్నట్లు తెలిపారు.

బడిలోనే విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం..

-చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, జూన్ 18, ప్రభాతవార్త:
విద్యార్థులకు బడిలోనే భవిష్యత్తు నిర్మాణం జరుగుతోందని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆయన స్వగ్రామం చించల్‌పేటలోని ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీచేశారు. అదే విధంగా రెవెన్యూ సదస్సులో కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థిదశలో కష్టపడితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి లక్ష్యాన్ని ఛేదిస్తారని చెప్పారు. ఉన్నత పాఠశాల అనంతరం ఇంటర్‌మీడియట్ లక్ష్యానికి మార్గం సుగమం చేసుకునే మహత్తరమైన రోజులని అన్నారు. ఈ స్థాయిని నిర్లక్ష్యం చేస్తే బంగారు భవిష్యత్తును పాడుచేసుకున్నట్లేనని అన్నారు. కొందరు యువత ఇక్కడే తప్పటడుగు వేస్తున్నారని ఈస్థాయిని అధిగమించిన ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించిన చరిత్ర ఉన్నదని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేర్పరులైన ఉపాధ్యాయులు విద్యాభోధన చేస్తారని ఈ నేపథ్యంతో ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

రెవెన్యూ సదస్సులతో రైతులకు ప్రయోజనం

భూభారతి అవగాహన రెవెన్యూ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడంతో రైతులకు ఎంతగానే ప్రయోజనాన్ని చేకూర్చే అరుదైన కార్యక్రమమని కొనియాడారు. రెవెన్యూ పరమైన సమస్యలను ఈకార్యక్రమం ద్వారా అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు, ఉపతహసీల్దార్ శ్రీలత, ఆర్‌ఐలు రజిత, రాజు, రెవెన్యూ సిబ్బంది మహమ్మద్‌ఆలీ, పరమేశ్, మౌనిక, మాహబూబ్‌జాని, శ్రీశైలం, పాషా, రాహుఫ్, నర్సింములు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్

షాద్‌నగర్, జూన్ 18, ప్రభాతవార్త:
వానాకాలం సీజన్‌కు రైతు పెట్టుబడి సాయం కింద భరోసా నిధుల విడుదల కొనసాగుతుందని, రైతుసంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 55,925 మంది రైతుల ఖాతాల్లో రూ.37 కోట్ల 80 లక్షల 75 వేల 627 రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా నిధులు తొమ్మిది రోజుల్లోనే జమ చేయనున్నట్లు తెలిపారని, ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వంనుండి మొదటిరోజు షాద్‌నగర్ నియోజకవర్గ రైతుల ఖాతాల్లో సాగు సాయం అందినట్లు తెలిపారు. రోజువారీగా మరింతమంది రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తామని, ఇంకా నియోజకవర్గంలో రైతుల ఖాతాల వివరాలు అందించని వారు వెంటనే మండల వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా మండల వ్యవసాయ అధికారికి అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని లబ్ది పొందాలని రైతులకు సూచించారు. ఎలాంటి పరిస్థితులలోనైనా తెలంగాణ రైతాంగంకోసం మాప్రభుత్వం నిలబడుతుందని, వారి సంక్షేమమే మాప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని, రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

అనురాగ్ యూనివర్శిటీలో కొనసాగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటుపై అవగాహన సదస్సు

ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంకు హాజరైన అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:
పోచారం మున్సిపల్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో ఐదు రోజుల పాటు జరుగనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా బ్లాక్ చైన్ ఆప్లికేషన్స్‌పై బుధవారం సెషన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆర్చన మంత్రి పాల్గొని మాట్లాడుతూ బ్లాక్ చైన్‌పై ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన ఎంతో ముఖ్యమని అన్నారు. బ్లాక్ చైన్ ప్రాముఖ్యత విద్యార్థులకు దానిని ఏవిధంగా బోధించాలో నేర్పించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల డీన్ వి.విజయ్ కుమార్, డిపార్టుమెంటు హెడ్ నితీశశర్మ, కోఆర్డినేటర్లు ఎ.ప్రశాంత్‌రావు, జిఎల్. ఆనంద్‌బాబు, వక్తలు బాలప్రసాద్‌లు పాల్గొనగా, అనురాగ్ యూనివర్శిటీ ఫ్యాకల్టీతో పాటు ఇతరత్రా కళాశాలలకు చెందిన దాదాపు 200 మందికి అధ్యాపకులు హాజరయ్యారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

షాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:
అంగన్ వాడితోపాటు ఆయా పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు మండల విద్యాధికారి లక్ష్మణ్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ మండలంలోని నాగర్ గూడ, ప్రాథమిక పాఠశాలలో చేరిన 16 మంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించడం జరిగిందన్నారు 5ఏళ్ళు నిండిన ప్రతి ఒక్క చిన్నారులను విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విధ్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ క్రిష్ణగౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు వెంకటేశ్, ముక్తార్, ఆబేద్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడల్లో మండల స్థాయి ఎంపికలు

చౌడాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:
2025-26 విద్యాసంవత్సరంలో నాలుగవతరగతి చదువుతున్న బాల బాలికలకు చౌడాపూర్ మండలస్థాయి క్రీడాపాఠశాల ఎంపికలు ఈనెల 21వ తేది, శనివారం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల చౌడాపూర్‌లో నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి రాంచందర్ తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు 01092016 నుండి 31082017 మధ్య జన్మించి, ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న వారు అర్హులని, ఇందులో పాల్గొనేవారు టిజిఎస్ఎస్.తెలంగాణ.ఇన్ వెబ్‌సైట్ నందు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాన్ని, నాలుగవ తరగతి బోనాఫైడ్ తీసుకొని శనివారం ఉదయం 9:30 నిమిషాలకు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఇసాక్ ఖాద్రి (9959903599)ని సంప్రతించాలని మండల విద్యాధికారి తెలియజేశారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

-పరిగి ఎబివిపి నాయకులు

పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎబివిపి నాయకులు

పరిగి, జూన్ 18, ప్రభాతవార్త:
పరిగి నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలలు అధికఫీజుల వసూలు, పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయిస్తూ, సామాన్యులను పీడిస్తున్నాయని, ప్రైవేటు పాఠశాలల దోపిడీని నియంత్రించాలని పరిగి ఎబివిపి నాయకులు డిమాండ్ చేశారు. పరిగిలోని కృష్ణవేణి పాఠశాలలో అక్రమంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని, ఎంఈఓ గోపాల్‌తో కలిసి పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈఓ పుస్తకాలను పరిశీలించి వాటిని సీజ్‌చేశారు. అన్నిపాఠశాలల్లో విక్రయాలను నిలిపి వేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల దోపిడీకి అడ్డుకట్టవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎబివిపి నాయ కులు అఖిల్, భరత్, మహేష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 18, ప్రభాతవార్త:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ జాగృతి నియోజకవర్గ మాజీకన్వీనర్ ముస్తాఫా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసిలకు ఇచ్చినహామీలు తుంగలోతొక్కడం సరికాదరి ఆయన తెలిపారు. బిసిలను మభ్యపెట్టి ఎన్నికలకు వెళ్లడం సరికాదని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళి

షాద్‌నగర్, జూన్ 18, ప్రభాతవార్త:
బిఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన మాగంటి గోపీనాథ్ దశదినకర్మకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరయ్యారు. కెటిఆర్‌తోపాటు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు హాజరై గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర సమాచార కమిషనర్‌ను సీనియర్ జర్నలిస్ట్

షాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:
రాష్ట్ర సమాచార కమిషనర్‌గా నియమితులైన పివి శ్రీనివాస్‌ను సీనియర్ జర్నలిస్ట్ యాస మల్లారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పివి.శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. గతంలో జర్నలిస్ట్‌గా దశాబ్దాలుగా కొనసాగి ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర సమాచార కమిషనర్‌గా పివి.శ్రీనివాస్‌ను నియమించడం సంతోషకరమైన విషయమని భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని మల్లారెడ్డి ఆకాంక్షించారు.

ప్రజల వద్దకే భూపరిపాలన

-మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్
-తహసీల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు

తహసీల్దార్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరిస్తున్న బాబర్‌ఖాన్

షాద్‌నగర్, జూన్ 18, ప్రభాతవార్త:
గతంలో జరిగిన తప్పులను సరిచేసేందుకు రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళనచేసి, భూపరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్తున్నామని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలకేంద్రంలో తహసీల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుకు బాబర్‌ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదస్సులో మొత్తం వివిధ సమస్యలపై 33 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఖాతాల మార్పిడి కోసం 17 దరఖాస్తులు, సర్వే నెంబర్ల సవరణకు 2 దరఖాస్తులు, భూముల హద్దుల సవరణకు 6 దరఖాస్తులు, నిషేధిత జాబితానుండి తొలగించుటకుగాను 5 దరఖాస్తులు, డిజిటల్ సంతకాల కోసం 1 దరఖాస్తు, ఇళ్ల స్థలాల సవరణకు సంబంధించి మరొక దరఖాస్తు అందినట్లు ఆయనతెలిపారు. ప్రజలవద్దకే రెవెన్యూ నినాదంతో భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. అనేకగ్రామాల్లో సాదా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ ఉంటుందని, అధికారులు సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. గతప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూసేవలను గ్రామస్థాయిలో అందించేందుకు కాంగ్రెస్‌ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి భూసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా నిలవనుందని ప్రశంసించారు. ఈ సదస్సులో కాంగ్రెస్ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాష, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగమోని సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవరాశుల మనుగడ

ఫోటో నెం,18ఎన్‌పీటీ03 మొక్కలు నాటుతున్న బిజెపి నాయకులు

నవాబుపేట, జూన్ 18, ప్రభాతవార్త:
పర్యావరణ పరిరక్షణతోనే సకల జీవరాశుల మనుగడ ఆధారపడి ఉన్నదని బిజెపి జిల్లా నాయకుడు జగన్ అన్నారు 11సంవత్సరాల సేవ సుపరి పాలనా వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే విరివిగా మొక్కలు నాటాలని కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంర్శించారు. వర్షాకాలంలో సంభవించే వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రతలు తీసుకోవాలని వైద్యసిబ్బందిని కోరారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రమాదకరమైన అంటువ్యాధులు సోకినవారు లేరని పరిశుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వైద్యసిబ్బంది తెలిపినట్లు ఆయన చెప్పారు. 11సంవత్సరాలుగా కేంద్రంలో సుదీర్ఘ బిజెపి పాలనలో అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాలు ప్రతి కుటుంభానికి అందుతున్నట్లు ఆయన అన్నారు. ఇదేస్ఫూర్తితో మెరుగైన సుపరిపాలనను అందించి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించే సత్తా ఉన్నది కేవలం బిజెపితోనే సాధ్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మన్, శివ, ప్రభు, మణికంఠరెడ్డి, రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు విద్యతోపాటు సంస్కారం, ఆరోగ్యం ఎంతో ముఖ్యం

-మాజీ మహిళా కౌన్సిలర్ మమతరాణి

అవగాహన కార్యక్రమంలో కల్పిస్తున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మమతరాణి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:
ఆడపిల్లలకు చదువుతో పాటు సంస్కారం, ఆరోగ్యం చాల ముఖ్యమని పోచారం మున్సిపల్ మాజీ మహిళా కౌన్సిలర్ బద్దం మమతరాణి అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడలోని జడ్పీ పాఠశాలలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో 8,9,10వ తరగతి బాలికలతో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ పాల్గొని మాట్లాడారు. ఆడపిల్ల అమ్మగామారిన తరువాత ఎన్నో బాధ్యతలు, కష్టాలు, సంతోషాలు ఎన్నో ఆటుపోట్లు ఎదురౌతాయని అన్నారు. ఆడపిల్ల తన దైనందిన జీవితంలో ఎల్లప్పుడు ధైర్యంగా సమస్యలు ఎదుర్కొంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. ఆడపిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా గోపికృష్ణ

ప్రత్యేక అధికారి గోపికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

కేశంపేట, జూన్ 18, ప్రభాతవార్త:
కేశంపేటమండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించిన రాజారత్నం కొన్నిరోజుల క్రితం పదోన్నతిపై నారాయణపేటకు వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన స్థానంలో బుధవారం కేశంపేట మండల ప్రత్యేక అధికారిగా రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ గోపికృష్ణ అదనపు బాధ్యతలను స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన గోపికృష్ణను ఇంచార్జ్ ఎంపిడివో కిష్టయ్య శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు, అనంతరం పంచాయతీ కార్యదర్శుల సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాలలో ఎక్కడా కూడా మంచినీటిసమస్య, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఉపాధిహామీపనుల్లో భాగంగా వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని వనమహోత్సవానికి మొక్కలు నాటటానికి గ్రీన్ ప్లాన్ తయారు చేసుకుని, వాటికి సంబంధించిన డాక్యుమెంట్ పూర్తిచేసుకుని సిద్ధంగా ఉండాలని ఉపాధిహామీ సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో టిఎలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

-తహసీల్దార్ ఆజం అలీ

దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆజం అలీ

కేశంపేట, జూన్ 18, ప్రభాతవార్త:
రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సును ఆయాగ్రామాల రైతులు సద్వినియోగించుకోవాలని కేశంపేట తహసీల్దార్ ఆజం అలీ అన్నారు. బుధవారం కేశంపేట మండలకేంద్రం, కాకునూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కాకునూరులో 5 దరఖాస్తులు, కేశంపేటలో 6 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆజం అలీ తెలిపారు. కేశంపేటలో సమస్యను పరిష్కరించి ప్రొసీడింగ్ అందజేశారు. కార్యక్రమంలో కేశంపేట మాజీ సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రెవిన్యూ సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐలు, చెన్నకేశవులు, నివేదిత, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, జూనియర్ అసిస్టెంట్లు శివ, మహేష్, జంగయ్య తదితర